# "ప్రేమ పిచ్చి"

శ్రీ నాళం కామరాజు

చిక్కిపోయిన బక్కతల్లిలా గోదావరీ నది ఎండిపోతున్న రోజులవి. ప్రవాహం మందగించడమే గాకుండా నదినిండా యింతేసింతేసి లంక లేర్పడ్డాయి. నీళ్ళన్నీ నిర్మలంగా ఎక్కడివక్కడే కదలకుండా కుంటల్లో వున్నట్లుండి పోయాయి. నది కిరువైపులా నీళ్ళల్లో బారెడుదూరంవరకు నాచు మొక్కలూ; యివతలగా మోకాలెత్తు ఎదిగిన తుంగమొక్కలూ-యింకా ఎన్నో రకాల గడ్డిమొక్కలూ-దట్టంగా పెరిగి పచ్చగా రంగేసినట్టు నిగనిగలాడ్తున్నా యెంతో ఆనందంగా-ఈ మొక్కలన్నీ ఆకదలికలేని నీటిలో ప్రతిబింబిస్తూ ప్రకృతికాంతకు మరొక రకమైన నూత్న శోభను తెచ్చిపెట్టుటకు శాయశక్తులా సాయపడ్తున్నాయి.

ఇక నక్కడ్నుంచీ యింకెంతదూరం నడిచినా గడ్డి ఎడారిలాగే వుంటుందా గోదావరివొడ్డు. తాటిచెట్లు తుమ్మచెట్లు-యింకా అవేమేమిటో పేరుతెలియని చెట్లు-ఓ పూర్తిగా పెరిగివున్నాయి- ఒహాపెద్ద అరణ్యభూమిలాగు.

ఆ గోదావరితల్లివల్ల ఎన్నెన్ని భూములు సేద్యమవుతున్నాయో- ఎంతెంతమంది ఎన్నెన్ని రకాలుగా జీవనాధారం చేసుకుంటున్నారో, అలాగే ఆ మైదానం కూడా ఎంతోమంది బీదజనానికి తెచ్చిపెట్టుకోని కల్పవృక్షంలా సాయపడ్తుంది. అంటే ఆ నదిలోని చేపల్ని పట్టుకుంటూ ఎంతమంది జీవిస్తున్నారో ఆ మైదానంలో గడ్డి కోసుకునికూడా అంతేమంది. జీవిస్తున్నారంటే వింతాలేదు-విశేషంలేదు

★

ఒకానొకరోజు సాయంత్రం అయిదు గంటలవేళ అది--పగలస్తమానం అలసిపోయిన సూర్యుడు ఎంతో బలహీనంగా పశ్చిమాంబుధిలో స్నానంచేయబోతూ ఆ నిట్టనిలువుగా దట్టంగావున్న తాడిచెట్ల సందుల్లోనుంచీ తొంగితొంగి చూస్తున్నాడు. అనంతమైన ఆ నీలాకాశంలో ఎక్కడా ఒక్క మేఘమన్నమాటే లేకపోవటంవల్ల ఎంతో హృదయాహ్లాదంగాను ఎంతో నిర్మలంగాను వుంది ఆకాశం. ఇటు గోదావరీ అటు అనేక రకాలయిన పచ్చనిచెట్లూ వుంటంవల్ల వాయుసోదరుడెంతో ప్రశాంతంగా విహారం చేస్తున్నాడా ప్రాంతాల్లో. మొత్తానికా సమయమెంతో విలువయ యిందన్నమాట.

ఆ అమ్మాయికి పదహారో, పదిహేడో ఏళ్ళుంటాయి. రంగు చామనచాయ అయినప్పటికీ దృఢమయిన శరీరంతో--తెచ్చి పెట్టుకోని సొబగుతో అదోరకమైన అందంగా వుంటుంది. అయితే పాపం భాగ్యవంతుల్లాగా నోములు నోచుకోలేదు కాబోలు -ఎప్పుడూ తళుకు బెళుకులాడ్తూ అంతఃపురాల్లో వుండేందుకు-యిష్ట మొచ్చిన బట్టలు ధరించేందుకు, ఇష్టమొచ్చిన విధంగా విహారం చేసెందుకు.

ఆయితే ఆ అమ్మాయి ఒక బీద కుటుంబంలో పుట్టి వుంటుంది. ఎప్పుడూ కూలిపనయినా చేస్తుండాలె, లేదా కోతలకైనా వెళ్తుండాలె-లేదా గడ్డి అయినా కోస్తుండాలె-అదీకాకుంటే యింకేదయినా చాకిరీ అయినా చేస్తుండాలె-కష్టపడ్తేనేగాని కడుపాడ్తుండదు-సోమరిపోతుదనం అంటే ఎమిటో వారికి తెలియనే తెలియదు.

ఆ అమ్మాయి పేరు బూచెమ్మ.

ఒక చేత్తో ఆ గడ్డి మొక్కల తలల్ని పట్టుకొని పదునైన కొడవల్తో రెండో చేత్తో కర కర కోసేస్తుందా గడ్డిమొక్కల్ని. కష్టమైన చోట్ల దోరుడు పారొకటి వుచ్చుకుని కుదుళ్లతో సహా కుళ్లగించేస్తుంది. బూచెమ్మకా పని ఎంతో సర్దా.

ఎట్లాగేం కష్టపడి పోగుచేసిన ఆ గడ్డినంతా ఒక మోపుకట్టింది ఓపిగ్గా. దీపాలు పెట్టే వేళకు ముందుగానే యింటికి చేరుకోవచ్చుననే సంతోషంతో ఆ మోపు నచ్చట్నే వుంచి కాళ్ళు, చేతులు కడుక్కునేందుకు బట్ట నెగకట్టుకుని గోదావరీ వొడ్డుకు వొచ్చింది. ఆ నీళ్ళనూ, అ నీళ్ల మీదనుంచీ వచ్చేగాలి కెరటాల్నీ- అస్తమించ బోయే ఆ ఎర్రటిసూర్యుణ్ణి- కలకలా రావములు చేస్తూ గూళ్ళకు వెళిపోతున్న ఆ పక్షుల్నీ- తన వేపు మందహాసంగా యికిలిస్తూ చూస్తున్న ఆ లతల్నీ- వరసగా గృహోన్ముఖ మవుతున్న ఆ గేదెల మందల్ని- చూస్తూ పరమానంద భరితురాలై ఆ గోదావరీ వొడ్డునే కూర్చుని ఒహ నిట్టూర్పువిడిచింది. ఆ నిర్మలమైన నీళ్ళని తన రెండు చేతుల్తో ఎత్తుతూ కాళ్ళమీద పోసుకుంటుంది. చూస్తుంది. తన లో తానెంతో వుల్లాస పడ్తుంది.

క్రమక్రమంగా ప్రకృతంతా నలనల బడ్తుంది. ఏదుటగా వున్న ఎర్రటి సూర్యబింబం సగం వరకు గోదావరిలో మునిగిపోయింది- పక్షుల కిలకిలలు కూడా చాలావరకు తగ్గింది. ఏవైపు చూచినా అంతా నిశ్శబ్దం.

బూచెమ్మ నెవరో అకస్మాత్తుగా కళ్ళు గట్టిగా మూశారు. వులిక్కిపడి ఎవరారంది. జవాబు వినబడ లేదు- 'ఏమిటా మోటు పట్టు...' అంటూ విదిలించుకుని ఆ రెండుచేతుల్నీ బలవంతంగా పెనగులాడి లాగి వేసింది.

గోపాలం పకపకా నవ్వేడు. 'అది గట్టిపట్టు; యిదో' అంటూ బూచెమ్మను ఒక్కసారిగా నీళ్లలోకి తోసేశాడు- పాపం బూచెమ్మ వెల్లకిల నీళ్లలో వడి మళ్లా తెప్పరిల్లుకుని లేచి నిలబడింది తడిసిపోయిన గుడ్డల్తో వొణుక్కుంటూను.

"చాల్లే గోపాలం ఏమిటీ వేళాకోళం" అని బొమముడి వేసింది.

గోపాలం ఆ మాటల్ని లక్ష్యం చేసినట్టు కనిపించదు.

"యిదిగో మాట్టాడే వంటే మళ్లా తోసేస్తాను- అటు చూడు-" అంటూ విరగబడి నవ్వేడు.

"చాల్లెద్దూ" అంటూ ముఖం చిట్లించుకుని అటుకేసి చూచింది. 'అమ్మో' అని కెవ్వున కేకేసింది- మళ్లా వెనక్కి నీళ్లలోనికి వెళిపోయింది.

గోపాలం మళ్ళా నవ్వేడు. "చూశావా వేళాకోళం అన్నావే- ఎంత పామో అది! నల్ల కోడె త్రాచు. కరిచిందంటే ఆ పాళాన విషం తలకెక్కి ఆర్ధక్షణంలో నిలువున ప్రాణాలు పోవాల్సిందే. ఎంత పెద్దపాము! ఎంత పెద్దపాము! అదికనుక కరిస్తే యింకేమయినా వుందా? పో, వెనక్కి వెళిపో-" అన్నాడు గోపాలం.

బూచెమ్మకింకా వొణుకెక్కువైంది- అలాగే వెనక్కి వెళిపోతుంది- పెదవులు మాత్రం కదుల్తున్నై-

"పోనియ్యి- ఆ పామును దాని త్రోవన దాన్ని పోనియ్యి" అంటూ ఒహ ప్రక్కకొచ్చి నిలబడ్డాడు గోపాలం.

'చూస్తావేం గోపాలం- వెర్రేమయినా వుందా- గోతులో వున్న ఆ కొరడాతో దాన్ని చావమోది ఒక్క దెబ్బతో పచ్చడి పచ్చడి చెయ్యకుండా చూస్తావేం" అంది బూచెమ్మ నీళ్ళలోనే వుండి.

పాము నెమ్మదిగా పోతూనే వుంది.

"మాట్లాడబోకు-దానిదోవన దాన్ని పోనియ్యి-దాన్నేం చేయకూడదు-" అన్నాడు గోపాలం.

అంతలో ఆపాము చరచర ప్రాకిపోయి అక్కడున్న పాముపుట్ట దగ్గిరికివెళ్ళి మాయమై పోయింది. మళ్లా కనపల్లేదు.

విరగబడి నవ్వేడు గోపాలం.

"రా-యికరా పాము వెళిబోయింది-"అన్నాడు గోపాలం ఆ అమ్మాయి కెదురుబోతూ.

"ఏమో-నాకు భయంవేస్తుంది-జంకుగావుంది-మళ్లా ఆపాము వస్తుందేమో-పసిపట్టిందేమో-"

"పసీలేదు-గిసీలేదు. వెళిపోయింది పాము-రా-జల్దీరా" అంటూ బూచెమ్మ రెండు భుజాల్ని పట్టుకుని వొడ్డుకు లాక్కొచ్చేడు. కట్టుకుంది తడిగుడ్డలూ, కడుపులోవుంది భయమూ అవటంవల్ల బూచెమ్మ శరీరం కంపిస్తూనే వుంది.

బూచెమ్మ తలను తన వొళ్లోపెట్టుకుని ఆ వొడ్డునే కూర్చున్నాడు గోపాలం. ఆ అమ్మా యెంతో బలహీనంగా పండుకుంది- అలాగే మూస్తూ తెరుస్తున్న కళ్లతో.

కొన్ని నిమిషాలు యిరువురూ మాట్లాడకుండానే జరిగి పోయాయి. కండ్లు నులుచుకుంటూ లేచింది బూచెమ్మ. వొంటి నున్న గుడ్డలు ఆరినై. భయంకూడ తగ్గిపోయింది.

"అమ్మో చాలా పొద్దోయింది-యింటి కెళ్ళిపోవాలి-వొదిలెయ్యి గోపాలం నే వెళి పోవాలి" అని లేవ ప్రయత్నించింది బూచెమ్మ.

"అవును-నిజంగానె పొద్దుగూకింది—నేకూడా వెళిపోవాలి-అయ్యో గొడ్లన్నీ అటూయిటూ చెదిరిపోయేయి-తోలుకొని వెళిపోవాలి తొందరగా"

"మరి వెళ్లవేం-?"

"వెళ్తాను-కాని...చూడూ ఆ పొద్దుగూకుట ఆ నీళ్లమీదనుంచీ వీచే చల్లనిగాలి, హాయిగా వుండిపోయిన ఆగూళ్లలోని పిట్టలూ-ఆ ప్రకృతి సౌందర్యం, చూడూ-వూరికి నే ఎలా పోగలను"

"అయితే" అని తల ఊపింది.

"మరి నిన్నెన్నాళ్లనుంచి అడుగుతున్నాను? నువ్వు కన్నెగరేసి వడివడిగా ఆరోజుకారోజు తప్పించుకు వెళిపోతున్నావు. నీ వుద్దేశం నాకూ తెలుసు-నావుద్దేశం నీకూ తెలుసు-ఎలా తప్పించుకు పోతావో చూస్తాను ఈవేళ."

"ఊం...చూస్తావు-? వెళిపోతున్నాను—ఏం చేస్తావో చెయి" అంది బూచెమ్మ గోపాల మొగం లోకి మొగంపెట్టి.

"ఏదీ-వెళ్ళు-ఎలా వెళ్తావో" అని అడ్డు నిలబడి బూచెమ్మను ముందుకు లాక్కొచ్చేడు.

"ఏమిటి గోపాలం యీపనులు? ఎవరేనా చూస్తే నవ్వి పోగలరు"

"ఎవరుచూస్తారు- ఎవరేమంటారు- నిన్ను నేను ప్రేమిస్తున్నాను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు-ఓరితో మనకేంపనీ-హా-హా" అని సన్నంగా నవ్వులు వుట్టిపడుతున్న వుల్లాసంతో.

"ఊం అలాగే" అంటూ వొయ్యారంగా ఒహ చిన్న దెబ్బేసింది గోపాలం బుగ్గమీద.

"ఉస్-కాక" అన్నాడు గోపాలం.

"యిదుగో నన్ను తాకేవా ..." అంది బూచెమ్మ.

"ఏం చేస్తావు" అంటూ బూచెమ్మ ముఖంలోకి ముఖంపెట్టి గట్టిగా కౌగలించుకుని ముందుకు లాక్కున్నాడు గోపాలం.

"అబ్బా" అంది బూచెమ్మ.

"యిక వొదులు- నీ మర్యాద తెలిసింది నే వెళిపోవాలి" అంది బూచెమ్మ.

"పొద్దు గూకింది కాబట్టి వొదిలేశాను; లేకపోతేనా... మళ్లా రేపెన్నింటి కొస్తావు? బారెడు పొద్దుండంగానే వొస్తావు కదూ! ఇదిగో మళ్లా యివ్వవూ వొక ముద్దు. నేను యిక వెళిపోతానుగా- మళ్లీ అడుగుతే వొట్టుపెట్టు. అంటూ మళ్లీ తన రెండు చేతుల్తో బూచెమ్మను కరిసి పట్టుకుని ముచ్చగా ముద్దుపెట్టుకున్నాడు.

"అబ్బా! ఏం పట్టుపట్టేవు గోపాలం-" అంటూ చేతుల్లోని పిట్టవలె రెపరెప కొట్టుకుంటూ తప్పించుకుని ఒక్క పరుగు తీసింది బూచెమ్మ.

ఉప్పొంగిపోయిన హృదయంతో తల పైకెత్తి ఒకసారి చుట్టూ చూచేడు గొడ్లవంక గోపాలం.

"ఇదుగో- గోపాలం- మోపెత్తి పోదువుగాని, రావూ" అంది బూచెమ్మ.

యిద్దరూ కలిసి ఆ మోపు దగ్గిరి కెళ్లేరు.

"రేపు మళ్లా పెందలకడ్నే వస్తావు కదూ" అంటూ మోపునెత్తేడు.

అతను చుట్టుప్రక్కల చెల్లాచెదరయిన గొడ్లన్నింటినీ ఒక్క చోటకు చేర్చేడు. యిద్దరూ కలిసి లొల్లి పాటలు పాడుకుంటూ- సరదాగా ముచ్చట్లు ఆడుకుంటూ- యింటిదోవ పట్టేరు.

వారా వూరి సమీపానికి చేరేసరికి వూరంతా పట్టపగల్లా ఎలెక్ట్రిక్ దీపాల్తో మిలమిలా మెఱిసి పోతుంది.

రోజుకంటె యింతాలస్యంఅయిందేమని ఆ వేళ యింటివద్ద యిద్దరికీ చీవాట్లు రానే వచ్చేయి. అయితే ఆ చీవాట్లను వారు అలక్ష్యంగా వొదిలేశారు.

ఈవిధంగా సహజమైన ప్రేమతో వారిద్దరు మనస్సులు నిండిపోయినవి. వారి జీవాలున్నంత వరకు ఆ ప్రేమవారిలో భిన్నం కాదు. అటువంటి నిష్కల్మషప్రేమ వారిది అటువంటి నిర్మలమయిన- పవిత్రమయిన ప్రేమ వారిది.

యిలా కొన్నాళ్లు బహు తొందరగా దొర్లిపోయేయి. రోజూ సాయంత్రం కాగానే బూచెమ్మ గడ్డికోసరం రావటం, గోపాలం గొడ్లను తోలుకుని రావటం, సంధ్యవేళ కాగానే గోదావరీ గట్టుకు చేరటం- వారి ప్రేమ సంభాషణలను సాగించటం- దీపాలు పెట్టేవేళకల్లా గృహోన్ముఖులనటం- యిలా జరిగిపోతుంది నిత్యమూను. యిన్నీ జరిగేది ఆ వొక్క ప్రదేశంలో నే- ఆవొక్క గోదావరీ వొడ్డునే- ఆవొక్కపచ్చిక బయలు మీదనే- ఆవొక్క అస్తమించబోయే సూర్యుని కెదురుగానె.

కాబట్టి వాళ్లిద్దరూ వాళ్ల నిష్కళంక ప్రేమ సామ్రాజ్యానికి అధిపతులె అని- అంతమందీ వారికి సాక్ష్యం వుండాల్సిందే- ఎన్నాళ్ల కయినా అంతే.

ఆవేళ సాయంత్రం అయింది. మామూలు ప్రకారం గోపాలం గొడ్లను తోలుకుని బయలుమీదికొచ్చాడు. అయితే ఆవేళ బూచెమ్మ కనిపించలేదు. గోపాలానికి వింతగా తోచింది. మరొక వేపుకు వెళ్లిందేమోనని చుట్టుప్రక్కలా వెతికాడు. చెట్టు చెట్టూ చూచాడు. గట్టంతా గాలించేడు. కాని ఎక్కడా అగుపించింది కాదు బూచెమ్మ. చాలా చింతించేడు. ముఖం యింత చేసుకుని మళ్లా వెతకటం ప్రారభించేడు. అగుపించింది కాదు. వెతికి వెతికి గోపాలానికి విసుగెత్తింది. ఏదో దుఃఖవార్త విన్నవాడిలాగు గుండెలు విడిపోయినై.

అతని చూపంతా నిలకడ లేకుండా ఎర్రటి నెత్తురుధారలాగ వడివడిగా ప్రవహిస్తున్న అతని కెదురుగావుండే ఆ గోదావరీ నీటిమీద వాలింది. అవి వర్షాకాలపు రోజులు. నీళ్ళు నది నిండుగా పుష్కలంగా వున్నాయి. నీళ్లలో ఏకోశాన చూచినా నిర్మలత్వమన్న మాటే కాన్పించదు. ఎక్కడెక్కడి చెట్లు, తాటాకులు కొట్టుకొస్తున్నాయా ప్రవాహంలో, కాని గోపాలానికదేమీ వింతగా తోచిందికాదు.

బూచెమ్మ ఎక్కడికెళ్లిందో, ఏవేపు కెళ్లిందో, పోనీ ఆకాశవాణైనా చెప్పకూడదా" అన్నట్టు ఒకసారి ఏమీ తోచక తల పైకెత్తేడు అస్తమించబోతున్న సూర్యబింబం మాత్రం అగుపించిందతనికి, ఉస్సురని ఒక నిట్టూర్పువిడిచేడు.

పోగా పోగా అతనికో పెద్ద జనసమూహం కనిపించింది. పోలీసులు చేతు లూపుతున్నారు. చొక్కా విడదీసి లంగోటీలు బిగిస్తున్నారు. కొందరు దూకుతున్నారు కొందరూ, దూకబోతున్నారు కొందరూ ఆ గోదావరిలోకి, దూకినవాళ్లెవరికీ అంతే చిక్కింది కాదు. కేకలు మాత్రం మహాజోరుగా రేగుతున్నాయి. ఎదురీత్తున్నారు కొందరు. వాలుగా యీత్తున్నారు కొందరు. మునిగి కొందరు, పల్టీలు కొట్టుతూ కొందరు- అనేక విధాలుగా వెతుకుతున్నారా నీళ్లలో- కాని ఆపాడుముండా నీళ్ల వేగానికి ఒక్కరూ తాళలేకపోయారు. అయితే వాళ్ల శాయశక్తులా సాధిస్తూనేవున్నారు. ఒడ్డునున్న జనం అందరూ ఎగాదిగా చూస్తున్నా రాతుర్దాగా ఏమయిందోఅని.

ఇంతమందీ జనంలోనుంచి త్రోసికుని ముందుకొచ్చేడు గోపాలం. గోపాలాన్నెవరు అంతమంది జనంలో లక్ష్యంచేసినవారులేరు. ఏ పుట్టలో ఏ పాముంటుందో.

గోపాలం అంటె అలావున్నాడు గాని. పెద్దగ జీతకాడు, వాడితో సరితూగే చెయ్యి ఆరాజమండ్రీ మొత్తం టవునంత గాలించి వెతికినా రాలేదన్నమాట, రాయిలాంటి దేహం వాడిది. పిరికితనం అనేదివాడి జన్మలో ఎరగడు.

యింకేం, వచ్చీరావటం విచారించ కుండానే ఒక్క గంతేశాడు. అసలు అతను ఆ ప్రవాహాన్ని లక్ష్యమూ చేయలేదు. ఒకోచోట మునిగేడు. ఒకచోట తేలేడు. ఒకోచోట పల్టీలుకొట్టి ప్రవాహానికెదురీదుతున్నాడు. ఎట్లాగేం ఆనీళ్లతో పెద్ద యుద్ధం చేశాడన్నమాట.

జనం క్రమంగా లక్షమంది జేరారక్కడికి. ఒకరికంటె ఒకరు మహా ఆతురతగా చూస్తున్నారు. ఆనీళ్ల వేపు, ఒక్కసారిగా అందరూ అదోతరహా అయిన ఆశాభావంతో పెద్ద కేకవేశారు. సెబాస్ సెబాస్ అని గగ్గోలు పెట్టేరు.

గోపాలం పూర్తిగా అలసిపోయేడు. కాని పట్టిన పట్టువదలకుండా, ఆ అలుపుతోనే, ఆ వొణుకుతోనే, ఆ తెలిపోతున్న దేహంతోనే, ఆ ప్రవాహంలో సాధించి సాధించి బయటకుతీసిన ఆవ్యక్తిని భుజాన వేసికుని

గట్టుమీద కొచ్చేడు. జనమంతా చుట్టూ మూగుతున్నారు. గోల అధికమయింది. పోలీసు వారు అందర్నీ శాంతపరచేందుకు భయపెట్టి మూకల్ని చెల్లా చెదరు చేస్తున్నారు.

భుజానవున్న ఆవ్యక్తిని అక్కడ పడవైచి, అలుపువల్ల చైతన్యంతప్పి తానుకూడా వెల్లకిల పడిపోయేడు గోపాలం.

అయితే అతని కష్టమంతా పాపం అరణ్యరోదనమయింది. అతని ప్రయత్నమంతా నిష్ఫలమయింది. యింత కష్టపడి బయటకు తీసిన ఆవ్యక్తి నిర్జీవియైవుంది. ప్రతీవారు విచారపడి "పాపం" అన్నారు.

పది నిమిషాలకాలం అయ్యేసరికల్లా ఆజన సమూహం అంతా పల్చబడిపోయింది. సూర్యుడు పూర్తిగా అస్తాద్రిగ్రుంకాడు.

పోలీసులు వగయిరా కొందరు పెద్దమనుష్యులు పట్టుబట్టి గోపాలానికి బహుమతీ యిస్తామన్నారు, గోపాలం కండ్లు తెరిచేసరికి ఎదురుగా మృతకళేబరం కనిపించింది. ఆ కళేబరాన్ని చూచీచూట్టంతోనే గుండె తరుక్కుపోయింది. ముఖం అంతా ఎర్రబారింది. ఏకధారగా కండ్లనుంచీ నీళ్లు కార్తున్నాయి. రెండు చేతుల్తో జుట్టు పీక్కుంటూ, బూచెమ్మా, బూచెమ్మా, అని ఆకళేబరం మీదపడి ఎంతోసేపు ఏడ్చాడు.

పోలీసులు, తదితరులు నిర్ఘాంతపడి చూస్తున్నారు. వారి కండ్లుకూడా చెమ్మగిలినై.

"అయ్యల్లారా! మీరు నాకు బహుమానం కాదుకదా ఒక్కపైసాఅయినా యివ్వ నక్కర్లేదు. నా కష్టం దక్కిందికాదు. యిది నావిధి, ఏంచేతనంటె ఈ శవమెవరిదోకాదు, నేను ఎన్నో రోజులునుంచీ నా మనస్ఫూర్తిగా ప్రేమించిన నా బూచెమ్మదేకాని, మరొకరిది కాదు" అంటూ ఏడ్చేడు గోపాలం. యిక మాట్లాడలేకపోయాడు. కంఠం రుద్ధమయింది.

పాపం గోపాలంకు ఏనీళ్లదగ్గిర, ఎంతమంది ముందర బూచెమ్మతో మైత్రికలిసిందో- ఆచోటే, అంతమంది ముందరే, మళ్లా వియోగం సంభవించింది. ఆ ప్రాంతంలోనే ఆ టయిములోనే ఒకప్పుడు తన కౌగిళ్లల్లో నల్గిన ఆ ప్రేమమూర్తి, యిప్పుడు ఆప్రాంతంలోనే ఆ టయిములోనే అనంతమైన గుండెమంటను కల్గించిన ఒక మృతకళేబరం అయింది.

★

అలా గోపాలం ఎంతసేపు ఏడ్చాడో, ఎంతకాలం ఏడ్చాడో, ఎవరికీ తెలియదు. అతను తోలుక వచ్చిన గొడ్లు అన్నీ ఏమయామో అసలే తెలియదు. ఆరోజు మొదలుకొని ఈ రోజువరకు 'బూచెమ్మా, బూచెమ్మా, అనిమాత్రం ఒక విధమైన కేక వేస్తూనేవున్నాడు. అరణ్య ప్రాంతాలన్నీ తిరుగుతున్నాడు "బూచెమ్మా, బూచెమ్మా" అంటూ.

పగలస్తమానం అతనెక్కడుంటాడో ఎవరికీ తెలియదు. వేకువజామునే వస్తాడు గోదావరీ వొడ్డుకు. స్నానంచేస్తాడు. అంతే; మళ్లా కన్పించడు. మళ్లా సాయంత్రం అరుకాగానే అదే గట్టుకు వస్తాడు. వొచ్చే పొయ్యేవారి నందరిని చూస్తూ "బూచెమ్మా, బూచెమ్మా" అంటాడు. అంతకంటె యికను ఒక్కపొల్లుకూడా మాట్లాడడు.

అతను పిచ్చివాడయి వుంటాడని కొందరంటారు కాదు ఏదయినా గోసాయిగాని లేదా మునీశ్వరుడుగాని అయివుంటాడని కొందరంటారు.

అతనిప్పటికీ "బూచెమ్మా బూచెమ్మా" అని కేకలేస్తూనే వున్నాడు. అతని కేకలకు ఆప్రదేశమంతా ప్రతిధ్వనిస్తుందిగాని "ఆ" అన్న జవాబు రానేరాదు. బహుశా అత నాజవాబుకోసరమే యింతవరకు జీవించి వుంటాడని నావూహా.